రాష్ట్రపతిని కలిసిన పూస రాజు



ముషీరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు, ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నేత పూస రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

మల్లు రవికి సత్కారం



కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవిని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన జరపాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం అభినందనీయం అన్నారు.

నేడు స్మారక పురస్కారాల అందజేత

నల్లకుంట: రాష్ట్ర దేవాలయాల మతైక అర్చక ఉద్యోగుల సంఘం, ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో బుధవారం దివంగత గంగు భాను మూర్తి స్మారక పురస్కారాలు–2024 అందజేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

గాంజా.. గ్యాంగ్స్..

పార్కులు, చెట్ల పొదలు, చెరువులే కేంద్రాలు

గుప్పుగుప్పుమంటూ గంజాయి పీలుస్తూ.. వదులుతూ.. యువత ఎంజాయ్ చేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే గుంపులుగా నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. అంతా కలిసి గంజాయి పీల్చడం సరదాగా మొదలుపెట్టి బానిసలుగా మారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు కొంతమంది అక్రమార్కులు యువతను లక్ష్యంగా చేసుకొని మొదట్లో గంజాయిని ఫ్రీగా ఇస్తున్నారు. వారు అలవాటు పడిన తర్వాత అధిక ధరలకు విక్రయించి డబ్బులు గడిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నా చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. – రామంతాపూర్

- సాయంత్రం మూసీ పరివాహక ప్రాంతాల్లో తిష్ట
- రకరకాల మార్గాల్లో గంజాయి అమ్మకాలు
- బానిసలవుతున్న యువకులు
- ఇటీవల రామంతాపూర్‌లో గంజాయి చాక్లెట్లు స్వాధీనం

రామంతాపూర్ పరిధిలో మూసీ ప్రాంతం విస్తరించి ఉండటం, నిర్మానుష్య ప్రాంతాలు అధికంగా ఉండటం, చెట్ల పొదలను యువత గంజాయి అడ్డాలుగా మార్చుకున్నారు. స్నేహితులతో కలిసి సరదాగా అటువైపు వెళ్తూ గంజాయి మత్తుకు చిత్తవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వాలిపోతున్న యువతకు వివిధ మార్గాల్లో అక్రమార్కులు గంజాయి సరఫరా చేస్తున్నారు. పోలీసులు ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నా.. గంజాయి విక్రయదారులు సవాల్ విసురుతున్నారు. గంజాయి విక్రయించే వారు పలువురి ద్వారా పోలీసుల కదలికల సమాచారం సేకరించి జాగ్రత్త పడుతున్నారు. కొంతమంది అక్రమార్కులు లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు అన్ని రకాలుగా కట్టడి చేసి యువత జీవితాలు నాశనం కాకుండా గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

34 కేజీల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

మేడ్చల్ జిల్లా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గత నెల 27న రామంతాపూర్ గాంధీనగర్‌లోని ఓ కిరాణా షాప్‌పై దాడి చేసి గంజాయితో తయారు చేసిన 34 కిలోల చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ చాక్లెట్లను రామంతాపూర్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు ఉప్పల్ పారిశ్రామికవాడల్లో కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.



రామంతాపూర్ గాంధీనగర్‌లో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎక్కడెక్కడ..?

రామంతాపూర్ పరిధిలోని చిన్న చెరువు వాకింగ్ ట్రాక్, శ్మశానవాటిక ప్రహరీగోడ, గోఖలేనగర్‌లోని బృందావన్ పార్కు, రాంరెడ్డినగర్ నుంచి ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే ఔట్ రోడ్డులో.. రామంతాపూర్ భగాయత్ మూసీ పరివాహక ప్రాంతాలైన బఫర్ జోన్‌తో పాటు ఉప్పల్ పారిశ్రామిక వాడలో గంజాయి విక్రయాలు, సేవించే కేంద్రాలుగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతాల్లో గంజాయి సేవించడానికి స్థానిక యువకులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారని చిన్న చెరువు వాకింగ్ ట్రాక్‌లో రాత్రయితే గుంపులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ ప్రాంతాలకు పెట్రోలింగ్‌కు వచ్చినప్పుడు తప్పించుకుని పారిపోతున్నారని, గంజాయి విక్రయదారులను అదుపులో పెట్టడానికి ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఎక్కువసార్లు పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన శిబిరాలు నిర్వహిస్తాం



గంజాయి సేవిస్తే కలిగే అనర్థాలపై యువతకు నిపుణులచే అవగాహన కల్పిస్తాం. అదేవిధంగా ట్రాఫిక్ సైబర్ నేరాలపై కళాశాలలు, స్కూళ్లలో పోలీసు విభాగం నిర్వహిస్తున్న అవగాహన శిబిరాల మాదిరిగానే గంజాయితో ఎదురయ్యే పరిణామాలపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను.
– బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కార్పొరేటర్

పిల్లలపై పర్యవేక్షణ ఉండాలి



తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ కలిగి ఉండాలి. చిన్నారులు చాక్లెట్ల కోసం తరచూ డబ్బులు అడుగుతుంటే పదే పదే చాక్లెట్లు తింటుంటే తల్లిదండ్రులు వారిని కనిపెట్టాలి. వారు తినే చాక్లెట్లను పరిశీలించాలి. కొందరు దుర్మార్గులు గంజాయి చాక్లెట్లను రూ.5 కు పిల్లలకు విక్రయిస్తూ వారికి అలవాటు చేస్తున్నారు.
– గడ్డం వెంకట్‌సాయి, రామంతాపూర్

'పూలే' విగ్రహం ఏర్పాటు చేయాలి

కాచిగూడ: బడుగు బలహీన వర్గాల స్ఫూర్తిదాత మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ కోకన్వీనర్ ఆర్వీ మహేందర్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈ నెల 12వ తేదీన ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేయాలని స్పీకర్, మంత్రులను కలిసి వినతి పత్రాలు అందించామన్నారు. ఏప్రిల్ 11వ తేదీలోగా అసెంబ్లీలో పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మహేందర్ హెచ్చరించారు.

'టీఎస్' పేరు మార్పుపై హర్షం



దూసరి రాజుగౌడ్

కాచిగూడ: వాహనాల నంబర్ ప్లేట్లపై టీఎస్ బదులు టీజీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దూసరి రాజు గౌడ్ హర్షం ప్రకటించారు. మంగళవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2007లో ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నప్పుడు తన కారుకు మొట్టమొదటిసారి టీజీ అని పేరు పెట్టిన విషయం గుర్తుచేశారు. ఈక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రాహుల్‌గాంధీ నిర్ణయం అభినందనీయం



మాట్లాడుతున్న మురళీకృష్ణ

నల్లకుంట: అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడమే కాకుండా రిజర్వేషన్ల పరిమితిని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించడంపై బీసీ జాగృతి అధ్యక్షుడు, కాంగ్రెస్ ఓబీసీ నాయకుడు కేపీ మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లకుంటలోని జాగృతి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాము అధికారం చేపట్టిన వెంటనే తొలి కార్యక్రమంగా పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల కులగణనను చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇవ్వడం సాహసోపేత నిర్ణయంగా అభివర్ణించారు.

'డీసీసీ' ప్రధాన కార్యదర్శిగా మైఖేల్

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గాంధీనగర్‌కు చెందిన బుసమల్ల మైఖేల్ ప్రసన్న నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ మైఖేల్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైఖేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవికి రావడానికి కృషి చేసిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ 'రాంనగర్' అధ్యక్షుడి మార్పు లేనట్టే!

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్‌ను మార్చే ఆలోచన లేనట్లు తెలిసింది. భవిష్యత్తులో నూతన కమిటీలు వేసినప్పుడే మార్పులు, చేర్పులు ఉండవచ్చని ఆ పార్టీ సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. దీంతో గత నెల రోజులుగా రాంనగర్ డివిజన్ అధ్యక్ష మార్పు విషయంలో జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్టే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుల విషయంలో మనస్పర్థలు, ఫిర్యాదులు వచ్చాయి. ముషీరాబాద్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తనను చిన్న చూపు చూస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కూడా పట్టించుకోవడం లేదని డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్ అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధ్యక్షుడిగా నియమించారు. ఇక రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ విషయంలోనూ ఎన్నికల సందర్భంగా పలు విమర్శలు, ఫిర్యాదులు వచ్చాయి. పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకోవడం లేదని, డివిజన్ ఇన్‌చార్జీలతో కూడా మోజెస్ సఖ్యతగా లేరని ఎమ్మెల్యేకు ఫిర్యాదులు అందాయి. అయితే, తనకు నమ్మకంగా ఉండే మోజెస్ వ్యవహారం ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది. దీంతో గత నెల రోజుల నుంచి మోజెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈక్రమంలో ముషీరాబాద్ డివిజన్ మాదిరిగానే రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిని మారుస్తారనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు మన్నె దామోదర్‌రెడ్డి, ఎర్రం శేఖర్, శంకర్‌ముదిరాజ్, వివేక్, అరుణ్, డేవిడ్ రాజు తదితరులు అధ్యక్ష స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మోజెస్ ఎమ్మెల్యేను కలిసి వివరణ ఇచ్చినట్టు తెలిసింది. ఫలితంగా అధ్యక్ష మార్పును ఎమ్మెల్యే వాయిదా వేసినట్టు సమాచారం.



రావులపాటి మోజెస్

పేదలకు అందుబాటులో వైద్య సేవలు




వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

కాచిగూడ: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని బేగంపేటలోని మెడికోవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్ తెలిపారు. కేఎస్ఎస్ ఛారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ నయీమ్ సహకారంతో ఇందిరానగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, ఆసుత్రి డాక్టర్లు పాల్గొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ తెలిపిన వివరాలు.. బుద్వేల్–ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి(50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్‌లను అందిస్తున్న సీఐ సీతయ్య

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను బాధితులకు ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య మంగళవారం అందించారు. సెల్‌ఫోన్‌లు ట్రేస్ చేయడంతో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం కానిస్టేబుల్ హరిప్రసాద్‌ను సీఐతో పాటు బాధితులు అభినందించారు.

మహిళను వేధించిన యువకుడికి జైలుశిక్ష



నిందితుడు నరేశ్

చిక్కడపల్లి: ఓ మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు శిక్షణ విధిస్తూ మంగళవారం తీర్పు వచ్చింది. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ సీతయ్య వివరాలు వెల్లడించారు. అశోక్‌నగర్‌లో ఓ మహిళను వేధించిన పి.నరేశ్‌కుమార్‌పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచగా ప్రత్యేక మేజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తుది తీర్పు వెలువరించారు.

హరికథ ఓ విశిష్ట కళారూపకం



హరికథకుడిని సన్మానిస్తున్న అతిథులు

నల్లకుంట: హరికథ తెలుగు వారి సంప్రదాయ కళారూపమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నల్లకుంట శంకరమఠంలో హరికథా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జీఎస్టీ అడిషనల్ కమిషనర్ దాసరి బాలయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హరికథను విశిష్ట కళారూపంగా తీర్చిదిద్దిన ఘనత ఆదిభట్ల నారాయణ దాసు, ఆదిభట్ల నారాయణవాసుకు చెందుతుందన్నారు. ఈ సందర్భంగా కట్టా జేజే నారాయణ భాగవతార్ 'భక్త మార్కండేయ' హరికథా గానం ఆహుతులను ఆకట్టుకుంది. చివరగా హరికథకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు, హర్షవర్ధన్, గుమ్మడి గోపాల్‌కృష్ణ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ ప్రభాకర్‌రావు, కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ కీర్తనలు అత్యుత్తమం



భాగ్యలక్ష్మి, మాధవి శిష్యుల గాన కచేరీ

నల్లకుంట: పంచరత్న కీర్తనల ద్వారా సంగీతం మీద త్యాగరాజ స్వామికి ఉన్న పట్టు తెలుస్తుందని శ్రీరామ గాన సభ కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ అన్నారు. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం శ్రీనివాస శర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా గుడిపాటి భాగ్యలక్ష్మి, చివుల మాధవి శిష్య బృందం ఆలపించిన కీర్తనలు, విజిల్ విజార్డ్ డాక్టర్ శివప్రసాద్ ఈల పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పెదరవలి జయభాస్కర్, వయోలిన్‌పై రామరాజు ధినకర్, ఘటంపై బాలసుబ్రహ్మణియన్ వాద్య సహకారం అందించారు.

షబ్బీర్ అహ్మద్‌కు ఘన నివాళి



నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) వ్యవస్థాపక అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ జయంతి ఘనంగా జరిగింది. టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం యూనియన్ కార్యాలయంలో కార్యక్రమంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ జోన్ డీఎం అండ్ హెచ్‌ఓ, మెడికల్ జాక్ కోకన్వీనర్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎంహెచ్‌ఈయూ నాయకులతో కలిసి ఆయన షబ్బీర్ అహ్మద్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మెడికల్ జాక్ కన్వీనర్ డాక్టర్ యాకేందర్ రెడ్డి, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబ్ట్ బ్రూస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్‌తుల్ ఆజమ్, అసోసియేటివ్ ప్రెసిడెంట్ ఎం ఫారూఖ్, ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు, లావణ్య, ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీకాంత్, రాఘవేందర్, సురేశ్, అబ్బాస్ పాల్గొన్నారు.

'బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటం'



ఢిల్లీ వెళ్తున్న నేతలతో శ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ: బీసీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి వందలాది మంది బీసీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వివిధ రైళ్లలో వెళ్తున్న బీసీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. 'బీసీలంటే వెనుకబడిన తరగతులు కాదని, బీసీలు అంటే బ్రిలియంట్ కులాలు' అని అన్నారు. జాతి జనగణనలో బీసీ గణన, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ వెళ్లినవారిలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కుల్కచర్ల శ్రీనివాస్, ఆటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్, గొడుగు మహేశ్‌యాదవ్, జాజుల లింగం, మరికుప్పల మధు, గూడూరు భాస్కర్, సిద్ధాంతం శ్యామల, సమతా యాదవ్, తారకేశ్వరి, మహేశ్ ఉన్నారు.

మానవ మనుగడకు ప్రకృతే ఆధారం



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ మనుగడకు ప్రకృతే జీవమని ప్రజాకవి డాక్టర్ జయరాజు అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'హైదరాబాద్ జిందాబాద్' ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు 'కాలుష్యాన్ని తరిమికొట్టండి' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయరాజు మాట్లాడుతూ.. మానవులకు, ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ప్రకృతి ఆహార నియమాలు, గాలి, కాలుష్యం, నీటి వనరులు, అడవుల ఏర్పాటు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు సమాజాన్ని కూడా చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సామాజికవేత్త హెచ్.రాజీవ్, లలిత, సైదులు, హైదరాబాద్ జిందాబాద్ నగర ప్రధాన కార్యదర్శి వీరయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, మోహన్‌నాయుడు తదితరులున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కావాలి



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ముషీరాబాద్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి కృషి చేయాలని హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధి సాంబశివరావు సూచించారు. మంగళవారం ముషీరాబాద్‌లోని వైఎస్ఆర్ పార్కు వద్దనున్న మినీ స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో ఫోరం ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్టివల్–2024 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ నివారణపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 85 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శ సభ్యుడు సత్యనారాయణ మాట్లాడారు. పిల్లల్లో సామాజిక స్పృహ కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విజేతలకు ఈ నెల 11వ తేదీన బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిటిజన్స్ ఫోరం కోఆర్డినేటర్లు శ్రీవల్లి, రాజమౌళి, బీఆర్ఎస్ మహిళా కమిటీ ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకురాలు రజిని, ఎంసీహెచ్ కాలనీ ఈస్ట్ పార్శిగుట్ట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు. చివరిగా హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం–2024 కేలండర్ ఆవిష్కరించారు.

కాంగ్రెస్ 'సేవాదళ్' అధ్యక్షుడిగా ప్రసాద్‌రావు

ముషీరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఫిరంగి ప్రసాద్‌రావు నియమితులయ్యారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జితేందర్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు కరణం సురేశ్.. ప్రసాద్‌రావుకు నియామకపత్రం అందజేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో సేవాదళ్ కార్యక్రమాలను నిరంతరం చేపడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ప్రసాద్‌రావు తెలిపారు. తనకు పదవీ ఇవ్వడానికి సహకరించిన సికింద్రాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరద రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌రావుకు నియామకపత్రం అందజేస్తున్న జితేందర్

జలమండలి ఎండీకి వినతి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ రవిచారి మంగళవారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాగ్‌లింగంపల్లిలో డ్రైనేజీ, మంచినీటి సమస్యతో పాటు తాగునీటి పొల్యూషన్ తీవ్రంగా ఉందన్నారు. రాంనగర్‌లో ప్రతిపాదించిన కొత్త వాటర్ లైన్‌లను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి



బుర్రకథ బృందంను సన్మానిస్తున్న దేవీప్రసాద్

చిక్కడపల్లి: ప్రాచీన కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. త్యాగరాయ గానసభలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాలం కృష్ణయ్య బృందం బుర్రకథా గానం చేశారు. అనంతరం దేవీప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, వైకుంఠం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయికుమార్‌కు 'ఆనందభైరవి' అవార్డు

చిక్కడపల్లి: భారతదేశం పుణ్యమైన దేశమని సినీ నటుడు సాయికుమార్ అన్నారు. సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆనందభైరవీ 12వ వార్షికోత్సవం సందర్భంగా 'జీవిత సప్తసాగరం గీతం' శీర్షికతో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. కళాతపస్వి కె.విశ్వనాథ్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆనందభైరవీ సంస్థ తనకు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. చివరిగా 'జై శ్రీరాం, భారత్ మాతకీ జై' అంటూ ముగించారు. అనంతరం నిర్వహించిన తెలుగు, హిందీ చిత్రగీతాల గానం అలరించింది. ప్రముఖ గాయని డి.సురేఖామూర్తికి ఎస్.జానకి అవార్డు, గాయకుడు వినోద్‌బాబుకు ఎస్పీ బాలు అవార్డు, కె.రాగమయికి సేవారత్న అవార్డులను ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సోమంచి వెంకటేశ్వర్లు, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, నిర్మాత నాగబాల సురేశ్‌కుమార్, అంతర్జాతీయ గాయకులు శారదాసాయి, ఉమాపతి, ఉదయ్‌కుమార్, ఉమాసింధు, ఆనంద్‌మోహన్ పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో ఇళ్ల కోసం వినతి

చిక్కడపల్లి: అన్యాయంగా స్వామి వివేకానందనగర్‌లో పేదల ఇళ్లను కూల్చిన చోటే తిరిగి గృహాలు నిర్మించాలని ప్రజావాణి నోడల్ అధికారి ఐఏఎస్ దివ్య దేవరాజన్‌కు డీబీఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. సమస్యపై ప్రజాభవన్‌లో కొనసాగుతున్న ప్రజావాణిలో ఐఏఎస్ అధికారి దివ్యరాజన్‌కు కలిశారు. తక్షణమే బాధితులకు నష్టపరిహారం అందించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఇళ్లు నిర్మించే వరకు తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నవీన్, కవిత తదితరులున్నారు.

సుబ్బరాయశర్మకు శోభన్‌బాబు పురస్కారం

చిక్కడపల్లి: సాంస్కృతిక సేవా సంస్థ స్వర సుధాఝరి ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటుడు శోభన్‌బాబు జయంతిని మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ, టీవీ నటుడు యు.సుబ్బరాయశర్మకు శోభన్‌బాబు పురస్కారాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేష శయనరెడ్డి ప్రదానం చేశారు. తొలుత గాయని పద్మశ్రీ త్యాగరాజు నిర్వహణలో గాయకులు శోభన్‌బాబు నటించిన చిత్రాలోని గీతాలను ఆలపించారు.